# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర హై కోర్టు ఆదేశాల మేరకు, న్యాయ సేవధికార సంస్థ ఆద్వర్యంలో హెల్మెట్ ధరించడంపై ప్రయోజనాలను వివరిస్తూ పలు జిల్లాలలో ఈరోజు అవగాహనా కార్యక్రమలను నిర్వహించారు.**
2. **తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈరోజు దర్శించుకున్నారు.**
3. **ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులను అమలు పరచడం ద్వారా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు.**
4. **పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న క్రీడాకారుల వివరాలను భారత ఒలింపిక్ సంఘం ఐఓఏ విడుదల చేసింది.**
5. **అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులపాటు వర్షాలు పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.**

==========================

రాష్ట్ర హై కోర్టు ఆదేశాల మేరకు, న్యాయ సేవధికార సంస్థ ఆద్వర్యంలో హెల్మెట్ ధరించడంపై ప్రయోజనాలను వివరిస్తూ పలు జిల్లాలలో ఈరోజు అవగాహనా కార్యక్రమలను నిర్వహించారు. విశాఖ జిల్లా న్యాయ సేవధికార సంస్థ ఆద్వర్యంలో ఈరోజు బీచ్ రోడ్డులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడకాన్ని ఒక బాధ్యతగా తీసుకోవాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మహేంధిర ప్రసాద్ , నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ హాజరయ్యారు. విజయవాడలో బెజవాడ బార్ అసోసియేషన్, మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "హెల్మెట్ ధరించడంపై" వన్–కె అవగాహన నడకను జిల్లా అదనపు ప్రధాన న్యాయమూర్తి సత్యానందం ప్రారంబించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనదారులు హెల్మెట్ ధరించుకొని తమ ప్రాణాలు కాపాడుకోవాలన్నారు.

--------------------------

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలాపురంలో ఈరోజు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురం రెండవ అదనపు న్యాయమూర్తి వి. నరేష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని తెలియజేస్తూ ..

...వాయిస్..28 సెకన్లు

---

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈరోజు దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారి తోమాల సేవలో కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం నితిన్ గడ్కరీని శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలని.. ఆర్థికంగా మెరుగుపడాలని దేవుడిని ప్రార్థించినట్లు చెప్పారు.

---

ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులను అమలు పరచడం ద్వారా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం పునః నిర్మాణ పనులను ఆయన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి ఈరోజు ఉదయం ప్రారంభించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ స్టేడియం నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామని అదే విధంగా శ్రీకాకుళం – ఆమదాలవలస రహదారికి అత్యవసరంగా కోటి రూపాయిల నిధులు విడుదల చేశామని, కొత్త రోడ్డు జంక్షన్ నుంచి వాకలవలస వరకూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామని మంత్రి ప్రకటించారు.

---

జాతీయ స్థాయీ విద్యా విధానం కింద అమలు జరుగుతున్న సంస్కరణల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని పాఠశాలలలో ఈ నెల 22 వ తేదీ నుండి “శిక్షా సప్తాహ్” కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ ఆదేశించింది. ఈ నెల 28 వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లులను భాగస్వాములను చేయాలని సూచించింది. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం కింద 22వ తేదీన స్థానిక వనరులతో బోధనా సామగ్రి ప్రదర్శన, 23న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల కార్యక్రమం, 24న క్రీడా పోటీలు నిర్వహించడం, 25న సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టాలని, 2న సాంస్కృతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించాలని, 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం కూడా నిర్వహించాలని పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ ఆదేశించింది.

---

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది అక్టోబరు 4 నుంచి 12 వరకు తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో పలు ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి ప్రకటించింది. అక్టోబరు 4 నుంచి 10 వరకు సుప్రభాత సేవ మినహా మిగిలిన ఆర్జిత సేవలను, 11, 12న అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు తెలిపింది. అంగ ప్రదక్షిణ, వర్చువల్ సేవలను బ్రహ్మోత్సవాలకు ఒకరోజు ముందు నుంచే రద్దు చేసారు. అక్టోబరు నెలకుగాను ఆర్జిత సేవల టికెట్లను ఈనెల 18 నుంచి జారీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో భక్తులు ఈ విషయాన్ని గమనించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

---

నీట్ – యూజి పేపర్ లీక్ వ్యవహారంపై ఈరోజు సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది. విస్తృత స్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని గుర్తిస్తేనే పునః పరీక్షకు ఆదేశించగలమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అదే విధంగా పిటిషనర్లకు వచ్చిన కనీస మార్కులపై సమాచారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

---------------------------

బ్రిటిష్ కాలం నాటి నేర చట్టాలను సవరణ చేయడం వల్ల నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని హైకోర్టు అదనపు న్యాయవాది బి.నరసింహశర్మ అన్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ సాంకేతిక విశ్వవిద్యాలయంలో నూతన చట్టాల అమలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహశర్మ మాట్లాడుతూ కొత్త చట్టాల్లో ప్రభుత్వం మహిళలు, చిన్నారులపై నేరాలకు ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. నేరాలకు లింగబేధాలు లేకుండా శిక్షపడేలా చట్ట సవరణలు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలుపుతూ..

వాయిస్ (29 సెకన్లు)

---------------------------

దేశంలో బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్–ఎన్సీపీసీఆర్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఎన్సీపీసీఆర్ ఆధ్వర్యంలో ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్–ఐసీపీ పరిశోధక బృందం వెల్లడించిన నివేదిక ప్రకారం, 2023–24లో గ్రామ పంచాయతీల సహాయంతో దేశంలో 59 వేల 364 బాల్య వివాహాలను అడ్డుకోగా ఇదే సమయంలో 17 రాష్ట్రాలు, అన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 265 జిల్లాల్లో ఉన్న 161 పౌర సమాజ సంస్థలు 14 వేలకు పైగా బాల్య వివాహాలను నిరోధించాయి. బాల్య వివాహాల నిరోధానికిగాను మహిళలకు నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్థిరత్వంపై దృష్టి సారించే ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని ఎన్సీపీసీఆర్ నివేదిక సిఫార్సు చేసింది.

---------------------------

పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న క్రీడాకారుల వివరాలను భారత ఒలింపిక్ సంఘం ఐఓఏ నిన్న ప్రకటించింది. వివిధ క్రీడలలో మొత్తం 117 మంది క్రీడాకారులు అత్యున్నత క్రీడా వేదికపై పోటీపడనున్నారు. అథ్లెటిక్స్‌లో అత్యధికంగా 29 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ నెల 26 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు జరగనున్న ఒలింపిక్స్ క్రీడల ఆరంభ వేడుకల్లో భారత షట్లర్ పి.వి.సింధు, టేబల్ టెన్నిస్ క్రీడాకారుడు శరత్ కమల్ పతాకధారులుగా భారత బృందాన్ని నడిపించనున్నారు.

---------------------------

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులపాటు కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. తీర ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారీ వర్షాలపై అత్యవసర సహాయం కోసం 1070, 112 నంబర్లకు కాల్ చేయాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు తెలిపారు.

======================